కూల్చుడులో బీజేపీ మేటి!

ప్రభుత్వాల రద్దులో కాంగ్రెస్ ఘనాపాఠి!!

ప్రజా ప్రభుత్వాలను పడగొట్టడంలో బీజేపీ ఫస్ట్

ఫిరాయింపులతో పార్టీల్లో చీలికలు తేవడంలో బిట్ట

- కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, అరుణాచల్, మణిపూర్ రాష్ట్రాల్లో ఈ వ్యూహాలతోనే అధికార పగ్గాలు
- రాష్ట్రపతి పాలనతో ప్రభుత్వాల రద్దులో కాంగ్రెస్ రికార్డు
- ఆర్టికల్ 356ని 100 కంటే ఎక్కువసార్లు వాడిన హస్తం
- సంచలన విషయాలను వెల్లడించిన ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటువేసే అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో స్పీకర్ జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై తెలంగాణ స్పీకర్‌పై ఇప్పటికే సుప్రీం కోర్టు పలుసార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. 'పదవీకాలం ముగిసేంత వరకు నిర్ణయం తీసుకోరా? ఇలాగైతే ప్రజాస్వామ్య విలువలు ఏం కావాలి?' అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సంబంధించి ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'ను పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రభుత్వాలను కూల్చడంలో ఏ పార్టీ ముందున్నదని అడిగారు. దీనిపై స్పందించిన గ్రోక్ 'బీజేపీ' అంటూ సమాధానమిచ్చింది. అలాగే, ఆర్టికల్ 356ని వందసార్లకు పైగా ప్రయోగించిన ఏకైక పార్టీగా కాంగ్రెస్ నిలిచిందని గ్రోక్ పేర్కొనడం వైరల్‌గా మారింది.

ప్రశ్న: ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రభుత్వాలను పడగొట్టడంలో దేశంలో ఏ పార్టీ ముందున్నది?

గ్రోక్: ఫిరాయింపులను ప్రోత్సహించడంలో తద్వారా ప్రభుత్వాలను పడగొట్టడంలో బీజేపీ ముందున్నది. ముఖ్యంగా 2014లో కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక ఈ ఫిరాయింపుల ఘటనలు, ప్రభుత్వాలు మారడాలు ఎక్కువయ్యాయి.

ప్రశ్న: ఫిరాయింపులతో పార్టీల్లో చీలికలు తీసుకురావడంలో ఏ పార్టీ టాప్‌ప్లేస్‌లో ఉన్నది?

గ్రోక్: ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. ఫిరాయింపులతో పార్టీల్లో చీలికలు తీసుకురావడంలోనూ బీజేపీనే ముందున్నదని చెప్పొచ్చు. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న 'మహావికాస్ అఘాడీ'లో విభేదాలను సృష్టించి.. శివసేన, ఎన్సీపీలు చీలిపోవడానికి బీజేపీనే కారణమని చెప్తారు.

ప్రశ్న: ప్రధాని మోదీ హయాంలో ఫిరాయింపులను ప్రోత్సహించి బీజేపీ ఏయే రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చింది?

గ్రోక్: ప్రధాని మోదీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించి బీజేపీ ఆరు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్, జేడీఎస్ కూటమి నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో 2019లో కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జ్యోతిరాదిత్య సింధియా నేతృత్వంలో కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో 2020లో మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టింది. శివసేన నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని చీల్చి, 2022లో మహారాష్ట్రలో బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకొన్నది. ఫిరాయింపుల ద్వారానే గోవా, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లోనూ బీజేపీ అధికారంలోకి వచ్చింది.

ప్రశ్న: ప్రభుత్వాలను రద్దు చేయడంలో ఏ పార్టీ ముందున్నది?

గ్రోక్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలను అత్యధికంగా రద్దు చేసిన పార్టీగా కాంగ్రెస్‌ను చెప్పొచ్చు. రాష్ట్రపతి పాలనను విధించేందుకు అవసరమైన రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను ఆ పార్టీ 100 కంటే ఎక్కువసార్లు ఉపయోగించింది. 70వ దశకంలో ఇందిరాగాంధీ పాలనలో ఈ ఆర్టికల్ దుర్వినియోగం ఎక్కువగా జరిగిందని చెప్పొచ్చు.

ప్రశ్న: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆర్టికల్ 356 ద్వారా ఏయే రాష్ట్రాల ప్రభుత్వాలను రద్దు చేసింది?

గ్రోక్: 1959లో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలో కేరళలో ఏర్పాటైన కమ్యూనిస్ట్ ప్రభుత్వాన్ని ఆర్టికల్ 356 ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. 1984లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ సర్కారుతో పాటు కర్ణాటక, పంజాబ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కాంగ్రెస్ రద్దు చేసింది.

ప్రశ్న: దేశంలో ఏ పార్టీ ప్రభుత్వం ఎక్కువగా రాష్ట్రపతి పాలనను విధించింది? ఏయే రాష్ట్రాల్లో ఎన్నిసార్లు విధించింది?

గ్రోక్: కాంగ్రెస్ హయాంలోనే దేశంలో రాష్ట్రపతి పాలన ఎక్కువగా విధించారు. మణిపూర్‌లో (10-11సార్లు), ఉత్తరప్రదేశ్‌లో (9-10సార్లు), కేరళలో (7-8సార్లు), పంజాబ్‌లో (7సార్లు), బీహార్‌లో (6-7సార్లు), ఆంధ్రప్రదేశ్‌లో (4-5సార్లు) ఇలా కాంగ్రెస్ పాలనలో ఎక్కువగా రాష్ట్రపతి పాలనను విధించారు.

సచివాలయంలో నకిలీ ఉద్యోగి

- కారుకు ప్రభుత్వ స్టిక్కర్ అంటించుకుని ప్రవేశం
- పోలీసుల అదుపులో నిందితుడు సమీర్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): సచివాలయానికి నకిలీ ఉద్యోగుల తాకిడి ఎక్కువైంది. తాజాగా ఓ నకిలీ ఉద్యోగిని సచివాలయ భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అత్తాపూర్‌కు చెందిన సమీర్ కారుకు 'టీజీ సెక్రటేరియట్.. ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అనే స్టిక్కర్ అతికించుకుని సచివాలయంలోకి ప్రవేశించాడు. అతని తీరుపై అనుమానం వచ్చి అడ్డగించడంతో.. తాను ప్రభుత్వ ఉద్యోగినంటూ దబాయించాడు. అనంతరం సెక్రటేరియట్ సీఎస్‌వో ఆదేశాల మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు విచారణ చేపట్టడంతో అసలు విషయం బట్టబయలైంది. తన భార్య మాలతి సెక్రటేరియట్‌లో అవుట్‌సోర్సింగ్ అటెండర్‌గా పనిచేస్తున్నదని, ఆమెను కలిసేందుకు వచ్చినట్టు సమీర్ చెప్పాడు. కారుకు స్టిక్కర్ వేసుకుని సచివాలయంలోకి ప్రవేశించడంపై ఎస్సై వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ

సమాజ హితమే జడ్జీల లక్ష్యం

- న్యాయమూర్తులకు వ్యవస్థ అండదండలు అవసరం
- రాష్ట్ర న్యాయాధికారుల సమావేశంలో జస్టిస్ నరసింహ

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): న్యాయమూర్తులుగా విధులు నిర్వర్తించేవారికి వ్యవస్థ అండదండలు ఎంతో అవసరమని, జడ్జీలకు ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ సమాజ హితమే లక్ష్యంగా పనిచేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ స్పష్టంచేశారు. హైదరాబాద్ జ్యుడిషియల్ అకాడమీలో శనివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర న్యాయాధికారుల 2వ వార్షిక సమావేశ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథి ప్రసంగిస్తూ.. రుజువర్తన, శాస్త్రీయ ఆలోచన, అధ్యయన శక్తి, కష్టపడి పనిచేయడం, వివాదాలను త్వరగా పరిష్కరించి బాధితులకు సకాలంలో న్యాయాన్ని అందించాలన్న లక్ష్యం న్యాయమూర్తుల ఔన్నత్యాన్ని పెంచుతాయని తెలిపారు. సాధన అనేది జీవితంలో అంతర్భాగం కావాలని, ఎవరినైనా అదే విజయతీరాలకు చేరుస్తుందని పేర్కొన్నారు. వ్యవస్థ అంటే ఓ భవనం కాదని ఒక ఆలోచనతో కూడినదని చెప్పారు. న్యాయవ్యవస్థలో ముందడుగు పడాలంటే ఇలాంటి సమావేశాలు కీలకమని పేర్కొన్నారు. సమావేశంలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ కే లక్ష్మణ్, అఖిల భారత న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడు అజయ్ నధాని, తెలంగాణ న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి మురళీ మోహన్ పాల్గొన్నారు.

రైతులకు రూ. 20వేల నష్టపరిహారం ఇవ్వాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : అకాల వర్షాలు, వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి టీ సాగర్ డిమాండ్ చేశారు. శనివారం వారు ప్రకటన విడుదల చేశారు. 20 రోజుల నుంచి అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా వేలాది ఎకరాల పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.20వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.40వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాసంగి పంటలు కోతకు వచ్చే తరుణంలో 20 రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలు, వడగండ్ల వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వాపోయారు. రాబోయే రోజుల్లో కూడా వర్షాలు పడే పరిస్థితి ఉందని వాతావరణ శాఖ ప్రకటించిందని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రమాదంలో భారతీయ న్యాయవృత్తి!

- విదేశీ న్యాయవాదులను ఎలా అనుమతిస్తారు?
- నిపుణుల సంప్రదింపులు లేకుండా చట్ట సవరణా?
- చట్టాన్ని సవరిస్తేనే.. దేశవ్యాప్తంగా ఆందోళనలు
- ఆలిండియా లాయర్స్ యూనియన్ అల్టిమేటం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు ఆమోదయోగ్యం కాదని, న్యాయనిపుణుల సలహాలు, సూచనలు లేకుండా సవరణలు తీసుకొస్తే బార్‌కౌన్సిల్ స్వతంత్ర ప్రతిపత్తి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. ఈ చట్టం తీసుకొస్తే న్యాయవాద వృత్తి మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని కమిటీ చెప్పారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశంలో కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, పార్థసారథి మాట్లాడారు. 1961 చట్టాన్నే కొనసాగించాలని, విదేశీ లాయర్లను అనుమతించవద్దని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలతో బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఆందోళనలు, నిరసనలు, ఉద్యమాలు చేయకుండా న్యాయవాదులను అణిచివేసే ప్రక్రియే కొత్త ముసాయిదా చట్టమని చెప్పారు. న్యాయవాద వృత్తిలోఉన్న వారికి మాత్రమే బార్ కౌన్సిళ్లకు ప్రాతినిధ్యం వహించాలని అభిప్రాయపడ్డారు. కొత్త ప్రతిపాదిత ముసాయిదాలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ అనే పేరే లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సవరణ చట్టం ప్రతిపాదనల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులకు రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనలేవీ లేవని సత్యనారాయణ గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం న్యాయవాద చట్టాన్ని సవరించాలని చూస్తే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కొత్త బిల్లుపై ఇప్పటికే పరిశీలనలు, ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్రప్రభుత్వానికి పంపినట్టు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, మాధవరెడ్డి, వెంకటేశ్, శర్మ, వేణుగోపాల్, రమేశ్‌కుమార్ మక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

మూడ్రోజులు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాగల మూడ్రోజులు పలు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం శనివారం బలహీనపడిందని, దీని ప్రభావంతో పలు జిల్లాల్లో గంటకు 30నుంచి 40కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నది.

వైటీపీఎస్‌కు ఇంజినీర్లు, ఉద్యోగుల కేటాయింపు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఎట్టకేలకు ఇంజినీర్లు, ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ (ఓఅండ్ఎం) స్టాఫ్‌ను టీజీజెన్‌కో కేటాయించింది. 194మందికి వైటీపీఎస్‌లో పోస్టింగ్‌ని చ్చింది. వీరిలో 32మంది ఇంజినీర్లు, 166మంది ఓఅండ్ఎం స్టాఫ్ ఉన్నారు.

వాణిజ్య

వడ్డీరేట్లను తగ్గించిన ఐవోబీ

చెన్నై, ఏప్రిల్ 12:ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) కూడా వడ్డీరేట్లను తగ్గించింది. రెపో లింక్డ్ లెండింగ్ రేటును పావు శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన రేట్లు వెంటనే అమలులోకి వచ్చాయని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రెపోతో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటు 9.10 శాతం నుంచి 8.85 శాతానికి తగ్గాయి. రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా బ్యాంక్ అసెట్ లయబిలిటీ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది.

ఎన్ఎస్ఈలో 22 కోట్లు దాటిన ఇన్వెస్టర్లు

ముంబై, ఏప్రిల్ 12: దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ ఎన్ఎస్ఈ(నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా) మరో మైలురాయిని అధిగమించింది. ఇప్పటి వరకు ఎన్ఎస్ఈ పెట్టుబడిదారులు 22 కోట్లు అధిగమించారు. అక్టోబర్ 2024లో 20 కోట్ల మంది పెట్టుబడిదారులను అధిగమించిన సంస్థ..ప్రస్తుతం మరో 2 కోట్ల మంది పెట్టుబడిదారులను ఆకట్టుకోగలిగింది. వీరిలో యునిక్యూ రిజిస్టర్ ఇన్వెస్టర్లు 11.3 కోట్లుగా ఉన్నట్టు పేర్కొంది. ఈక్విటీలో అత్యధిక మంది పెట్టుబడిదారులు కలిగిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర తొలిస్థానంలో నిలిచింది. ఈ రాష్ట్రం నుంచి 3.8 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో 2.4 కోట్లు, గుజరాత్‌లో 1.9 కోట్లు, రాజస్థాన్, బెంగాల్‌లో 1.3 కోట్ల మంది ఉన్నారు. మొత్తం ఇన్వెస్టర్లలో వీరి వాటా 49 శాతంగా ఉన్నది. గడిచిన ఐదేండ్లుగా నిఫ్టీ 50 ఇండెక్స్ సూచీ వార్షిక ప్రతిపాదికన 22 శాతం రిటర్నులు పంచిందని, నిఫ్టీ 500 ఇండెక్స్ 25 శాతం రిటర్నులు పంచినట్టు ఎన్ఎస్ఈ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ తెలిపారు.

నిమ్జ్‌పై నిర్లక్ష్యమేల!

- భూములు సిద్ధంగా ఉన్నా కేటాయించని సర్కారు
- అతీగతీ లేని జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ
- ప్రభుత్వ తీరుపై పరిశ్రమ వర్గాల నుంచి విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : భారీగా పెట్టుబడులు సాధించినట్టు గొప్పలు చెబుతున్న రాష్ట్ర సర్కారు పరిశ్రమలకు భూముల కేటాయింపు, అనుమతులు మంజూరుపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్టు పరిశ్రమ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్(నిమ్జ్)లో పరిశ్రమల ఏర్పాటుకు పలు పరిశ్రమలు ముందుకొస్తున్నా అనుమతులు ఇవ్వడం లేదని చెబుతున్నారు. హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నిరుడు కేంద్ర ప్రభుత్వం జహీరాబాద్‌కు ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీని మంజూరు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల అందులో పురోగతి లేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, న్యాలకల్, జరాసంఘం మండలాల పరిధిలో సుమారు 13,500 ఎకరాల్లో నిమ్జ్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇందులో దాదాపు 8 వేల ఎకరాల పైచిలుకు భూముల సేకరణ కూడా పూర్తయ్యింది. అంతేకాదు, దీని కోసం కేసీఆర్ సర్కారు కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కూడా సాధించింది. ఇందులో సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 2.44 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా. నిమ్జ్ అభివృద్ధిలో భాగంగా అంతర్గత మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.4,500 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా గత ఏడాది కేంద్రం జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీని మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే ఇక్కడ భారీగా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశమున్నది. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి పరిశ్రమల రంగంపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఫోర్త్‌సిటీకి పెట్టుబడులు మళ్లించేందుకు మిగిలిన ప్రాంతాలను సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నదని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. నిమ్జ్‌లో అనేక ఆటోమొబైల్, ఇంజినీరింగ్ కంపెనీల ఏర్పాటుకు పరిశ్రమలు ముందుకొస్తున్నాయి. ఓ ప్రధాన కార్ల కంపెనీ రెండేండ్ల క్రితమే జహీరాబాద్ ప్రాంతంలో టెస్టింగ్ ట్రాక్ నెలకొల్పేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. అయినప్పటికీ పరిశ్రమకు అవసరమైన భూ కేటాయింపు, అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయలేదని సమాచారం. ఇదే తరహాలో పలు ఈవీ కంపెనీలు భూములు కేటాయిస్తే పరిశ్రమలు ఏర్పాటుచేయనున్నట్టు తెలుస్తున్నది. పలు పరిశ్రమలు టీజీఐఐసీని సంప్రదిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకోవాలని సూచిస్తున్నట్టు సమాచారం. ఏడాదిన్నరగా ఎన్నో పరిశ్రమలు నిలిచిపోయాయని, ప్రభుత్వం సిఫారసు చేసే కంపెనీలకు మాత్రమే భూకేటాయింపులు జరుగుతున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రణాళికలు కాగితాలకే పరిమితం..

మరోవైపు, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గత ఏడాది జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని మంజూరు చేసింది. రూ.28,602 కోట్లతో దేశవ్యాప్తంగా 12 పారిశ్రామిక స్మార్ట్‌సిటీలను మంజూరు చేయగా, అందులో జహీరాబాద్‌కు కూడా చోటు లభించింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిమ్జ్ కోసం భూసేకరణ చేయడంతోపాటు పర్యావరణ అనుమతులు కూడా సాధించడంతో జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు లేవని చెప్పవచ్చు. కేంద్రం ఇచ్చే నిధులతో రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తే సరిపోతుంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి కేంద్రీకరించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జహీరాబాద్‌లో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ మొదటి దశకు అవసరమైన 3,245 ఎకరాల భూమికి సంబంధించి 3,100 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉంది. రాష్ట్రానికి సంబంధించి.. షేర్ హోల్డర్స్ అగ్రిమెంట్(ఎస్‌హెచ్ఏ), స్టేట్ సపోర్ట్ అగ్రిమెంట్(ఎస్ఎస్ఏ) ఇదివరకే పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ వస్తువులు, ఫుడ్ ప్రాసెసింగ్, మెషినరీ, మెటల్స్, నాన్-మెటాలిక్ ఆధారిత పరిశ్రమలు, రవాణా తదితర రంగాలకు ఊతం అందనుంది. హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని న్యాలకల్, జరాసంగం మండలాల్లోని 17 గ్రామాల్లో జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీని ఏర్పాటుచేయాలని ప్రణాళికలు రూపొందించారు. రెండు దశల్లో దాదాపు 12,500 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును విస్తరించాలని నిర్ణయించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్(ఎన్ఐసీడీఐటీ) ఫ్రేమ్ వర్క్‌లో భాగంగా.. 3,245 ఎకరాల్లో మొదటి దశ పనులను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ స్మార్ట్‌సిటీ పుణె-మచిలీపట్నం జాతీయ రహదారికి 2 కిలోమీటర్ల దూరంలో ఉండడమే కాకుండా నిజాంపేట్-బీదర్ (ఎస్‌హెచ్-16), జహీరాబాద్-బీదర్ (ఎస్‌హెచ్-14)కి సమీపంలో ఉన్నది.అయినప్పటికీ ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ప్రణాళికలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మహిళలకు ప్రత్యేక పారిశ్రామిక పార్కులు

- మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : మహిళల కోసం ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక పారిశ్రామిక పార్కులు ఏర్పాటుచేయనున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. వీటిలో గ్రామీణ మహిళలకు ప్రాధాన్యమివ్వనున్నట్టు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో 'ఫుడ్ ఏ ఫెయిర్' రెండో ఎడిషన్ బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీ, ఫార్మా మాదిరిగానే వ్యవసాయ, వ్యవసాయాధారిత రంగాల్లోనూ తెలంగాణను ప్రథమస్థానంలో నిలుపడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఉన్న ట్టు తెలిపారు. ఇప్పటికే ఈ రంగంలో రూ.16 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, అవి వివిధ దశల్లో ఉన్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 7,150 ఎకరాల్లో 14 స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఉన్నాయని, రానున్న రోజుల్లో ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలు, పట్టణాల్లోనూ ఏర్పాటుచేస్తామని తెలిపారు. 6,800కు పైగా మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, కొత్తగా ఏర్పాటుచేసే ఔత్సాహికులకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ కమిషనర్ మల్సూర్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్, ఫుడ్ ఏ ఫెయిర్ నిర్వాహకులు శ్రీకాంత్, టీజీ శ్రీకాంత్, విశాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీకార సుంకాల నుంచి ఫోన్లకు మినహాయింపు

కంప్యూటర్లు, మెమొరీ చిప్‌లు, సెమికండక్టర్లకు కూడా..

మరో కీలక నిర్ణయం తీసుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 12: ప్రతీకార సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వెనుకడుగు వేశారు. ఇప్పటికే సుంకాల అమలు 90 రోజులపాటు వాయిదావేసిన ట్రంప్..తాజాగా పలు ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు మినహాయింపునిచ్చారు. వీటిలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, హార్డ్ డ్రైవ్‌లు, మెమొరీ చిప్‌లు, సెమికండక్టర్లు, సోలార్ సెల్స్, ఫ్లాట్ టీవీ డిస్‌ప్లేలు ఉన్నాయి. ఈ మేరక అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటె